క్లుప్తంగా

జంతువులను ప్రేమించాలి



జంతుబలుల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెంకటగిరి రూరల్ : జంతు బలులు నివారించి జంతువులను ప్రేమించాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకులు రాజగోపాల్, రమణయ్య, చెంచుకృష్ణయ్య, శోభారాణి కోరారు. వారు సోమవారం జంతు బలుల నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మూగజీవి ప్రాణం తీసి మాంసం తినడం ఆహారం కాదన్నారు. మూగ జీవులకు ప్రాణ భిక్ష పెట్టి శాఖాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ది స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు శివబాబు, బాలసుబ్రమణ్యం, సుధ, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్తరాశపాళెంలో 21న కుంభాభిషేకం

దొరవారిసత్రం : ముత్తరాశపాళెం గ్రామంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21న స్వామివారి పటము ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగా హోమం, వెంకటేశ్వరస్వామి పటము ప్రతిష్ట, కల్యాణం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరు రూరల్ : పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు లేక మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థికి ప్రగతి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ.10 వేల సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వాకాడు మండలానికి చెందిన పనబాక శ్రీనాథ్ అనే విద్యార్థి ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరాడని తెలిపారు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేక పోవడంతో చదువు వద్దని నిలిపివేశారని పేర్కొన్నారు. ఈ విషయం సంస్థ దృష్టికి రావడంతో చదువుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామ్మోహన్, ప్రభాకర్, పెంచలయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, క్రిష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిల్లకూరు : క్రిష్ణపట్నం పోర్టు యాజమాన్యం అదానీ క్రిష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సామాజిక బాధ్యతలో భాగంగా సోమవారం తమ్మినపట్నంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. తమ్మినపట్నంలో 100 మందికి, గుమ్మడిబ్బలో 50 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. అదానీ ఫౌండేషన్ మెడికల్ అధికారి సుహర్షన్‌రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల ఎక్కువగా జ్వరాలు, డయేరియా ప్రబలుతున్నాయని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలను తినాలని పేర్కొన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలో ఉన్న అడివయ్య కాలనీలోని అనాథ శరణాలయంలో ఉన్న పిల్లలకు సోమవారం బాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. వాటిని కరుణామయి విద్యా సంస్థల నిర్వాహకులు బి.క్రిష్ణకుమార్ అందజేశారు. తమ బావ పట్టెం గంగాధర్ వర్ధంతి సందర్భంగా దుస్తులు, దుప్పట్లు అందజేసినట్టు క్రిష్ణకుమార్ తెలిపారు. బాస్ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ అనాథ శరణాలయంలో ఉన్న పిల్లలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పృథ్వీ, గ్లోరీ, రహంతుల్లా, రమేష్, ఆశ్రమ నిర్వాహకులు బాషాజాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నక్క చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

కోట: మండలంలోని పెన్నక్క చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. మండలంలో ప్రధాన నీటి వనరుగా ఉన్న పెన్నక్క చెరువు నుంచి వెంకన్నపాళెం సమీపంలో ఉన్న ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై వైఎస్సార్ సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకుల అండతోనే రాత్రీ, పగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతి

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం టుపాళెం సర్కిల్ ప్రాంతంలోని బస్ షెల్టర్‌లో సోమవారం వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడు గూడూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్కు ప్రాంతానికి చెందిన ముక్తియార్(60)గా గుర్తించారు. అతను కొంత కాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువులు పలు ప్రాంతాల్లో గాలించారు. కుటుంబ సభ్యులు తనను వదలి వెళ్లారనే మనోవేదనతో మృతి చెంది ఉండవచ్చని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలు డాక్టర్లు కాకూడదా..?



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో 2,185 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా వచ్చాయి. వాటిని కొనసాగించకుండా ప్రైవేట్‌పరం చేయాలని చూడడం దారుణం. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి పేదలు డాక్టర్లు కాకూడదన్నట్టుంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య అందేలా చూడాలి.

- యల్లంరాజు వరప్రసాద్‌రాజు, లింగసముద్రం, సైదాపురం



పేదల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలి



మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించి విద్యార్థుల ఉజ్వల భవితకు నాంది పలకాలి. కళాశాలల నిర్మాణం జరగలేదని, క్లాస్ రూంలు లేవని, ప్రొఫెసర్లు లేరని సాకులు చెబుతూ రాష్ట్రానికి వచ్చిన వైద్య విద్య సీట్లను రద్దు చేయాలని లేఖ రాయడం దారుణం. పేదలు రూ.లక్షల ఫీజులు చెల్లించి వైద్య విద్య అభ్యసించలేరు. ప్రభుత్వ కళాశాలలు వస్తే సీట్లు పెరిగి అందరికీ అవకాశాలు కలుగుతాయి.

- వరదబండి ప్రభాకర్‌రెడ్డి, మర్లపూడి, సైదాపురం

అసంపూర్తి పనులు



శ్రీధనమల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగిన తరగతి గదుల నిర్మాణం





నేతాజీనగర్, కల్లూరుకండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మాణం మెటీరియల్స్, అసంపూర్తి పనులు

విద్యతోనే ఉన్నత స్థానాలు సాధ్యమని పెద్దల మాట. పిల్లలకు సరైన వసతులు కల్పిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంది. విడతల వారీగా అభివృద్ధి పనులు చేసింది. సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొన్ని పాఠశాలల్లో పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. ఫలితంగా పాఠశాలల ఆవరణలోనే నిర్మాణ వస్తువులు ఇసుక, మెటల్, ఇటుక, కమ్మీ తదితరాలు ఉండిపోయాయి. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

– దొరవారిసత్రం

- పాఠశాలల్లో పడేసిన నిర్మాణ వస్తువులు
- పనుల గురించి పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

దొరవారిసత్రం మండలంలో మన బడి నాడు–నేడు కింద రెండో విడతలో 26 పాఠశాలలల్లో పనులు చేపట్టేందుకు రూ.6 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. కొన్ని పనులు మాత్రమే మిగిలాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం అసంపూర్తి భవనాలు, ప్రహరీ నిర్మాణాలు, మరుగుదొడ్డి పనులు, పాఠశాల మరమ్మతు తదితర పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆటంకాల నడుమ బోధన

కల్లూరు, శ్రీధనమల్లి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత, డీవీసత్రంలోని కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాల, మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాల, నెలబల్లి, అక్కరపాక ఎంపీయూపీ, నేతాజీనగర్, కల్లూరుకండ్రిగ, సిద్ధాపురం తదితర ప్రాథమిక పాఠశాలల్లో నాడు–నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్నిచోట్ల భవన వసతి లేనందున అసంపూర్తి అదనపు భవనాల్లోనే తరగతులు కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు పూర్తికాకపోవడంతో విద్యార్థులు చెట్లు, పుట్టల చాటుకు మూత్ర విసర్జనకు వెళుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాడు–నేడు అసంపూర్తి పనులను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి పనినీ పూర్తిచేయాలి



గత ప్రభుత్వం హయాంలో మన బడి నాడు–నేడు కింద పాఠశాలల్లో పనులు చేపట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు ఆగిపోయాయి. అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రతి పనినీ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే విద్యార్థులకు వసతులు నెలకొంటాయి. విద్యార్థుల చదువులు చక్కగా కొనసాగుతాయి.

- ఎన్.మధు, సర్పంచ్, వెదురుపట్టు పంచాయతీ

అసంపూర్తి పనులతో తప్పని తిప్పలు



మా పంచాయతీలో కొన్ని పాఠశాలల్లో నాడు–నేడు కింద పనులు చేపట్టారు. కొన్నిచోట్ల ఎన్నికల సమయంలో అసంపూర్తిగా ఆగిపోయాయి. నిర్మాణ వస్తువులు ఆవరణలో ఉండడంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. ఈ విషయాన్ని పాలకులు, అధికారులు గుర్తించి అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు పూర్తి చేయాలి.

- కె.రామయ్య, సర్పంచ్, నేలపట్టు పంచాయతీ

మృతుడి కుటుంబానికి కిలివేటి పరామర్శ



సాయినవీన్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటకు చెందిన కౌన్సిలర్ సాదు శాంతి కుమారుడు సాయినవీన్ (37) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం వీధిలో ఉన్న వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. సాయినవీన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ శాంతి, కుమారుడు మోహన్‌తో మాట్లాడి చిన్నా మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటం దీపిక, పార్టీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, నాయకులు షేక్ రహంతుల్లా, పేర్నాటి రాహుల్, రాయపు శేఖర్, కౌన్సిలర్లు పాపాడి చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, పాలేటి నాగార్జున, రాయపు సరిత తదితరులు సంతాపం తెలిపారు.

ఎఫ్‌ఏ తొలగింపునకు టీడీపీ నేతల కుట్ర

- ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదం
- కల్లూరు, కల్లూరుకండ్రిగ గ్రామాల మధ్య ఘర్షణ

దొరవారిసత్రం : గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్ల అరాచకానికి అడ్డూ అదుపూ లేకుండాపోయింది. తప్పు లేకపోయినా వివాదాలు, ఘర్షణకు దిగుతున్నారు. అన్ని చోట్ల శాఖల్లోనూ తమ వ్యక్తులే ఉండాలని అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. దొరవారిసత్రం మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చెంగయ్య పదేళ్ల నుంచి ఉపాధి పనులు చేయిస్తున్నాడు. టీడీపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి అతన్ని తొలగించేందుకు తెలుగు తమ్ముళ్లు ప్రయత్నం చేస్తున్నారు. అతను వైఎస్సార్ సీపీ నాయకులకు అనుకూలంగా ఉన్నాడని, అతన్ని తొలగించి తమ మనిషిని నియమించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఫలితం లేకపోవడంతో ఎఫ్‌ఏను ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చారు. ఎఫ్‌ఏ అన్నిటినీ ఎదుర్కొంటూ పనులు చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కల్లూరుకండ్రిగ గ్రామానికి చెందిన ఎఫ్‌ఏకు అనుకూలురైన వ్యక్తులకు తన బాధ చెప్పుకున్నాడు. దీంతో కల్లూరు, కల్లూరుకండ్రిగ గ్రామాల్లో టీడీపీ, వైఎస్సార్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వివాదం ఆదివారం రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో ఒక వర్గానికి చెందిన సలీమ్, రహీమ్, నాగప్రసాద్, ధనుంజయులు గాయపడ్డారు. ఇరువర్గాల వారు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమమే ఎస్‌డబ్ల్యూఎఫ్ లక్ష్యం

గూడూరు రూరల్ : ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ తెలిపారు. ఎస్‌డబ్ల్యూఫ్ 46వ వార్షికోత్సవం సందర్భంగా సోమవా రం గూడూరులోని ఆర్టీసీ డిపో ఎందుట జెండా ఎగురవేశారు. నాయకులు శేషయ్య, రఘురామయ్య, రమణయ్య, గురవయ్య, వెంకటేశ్వర్లు, క్రిష్ణ, సుబ్రమణ్యం, కిరణ్, వాసు, శ్రీధర్, శ్రీనివాసులు, సురేష్, బీవీరమణయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం కార్మికులు ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బీవీ రమణయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఎస్ఆర్ చంద్రయ్య, వజీర్‌బాష, బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడలిలో ఆగని ఇసుక దోపిడీ



రాత్రి పూట ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

కోట: టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని గూడలిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారికి పోలీసులు, రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని చెబుతున్నారు. స్వర్ణముఖి నదిలో గూడలి నుంచి రుద్రవరం వరకు నాణ్యమైన ఇసుక లభిస్తుంది. దీనిపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. స్వర్ణముఖిలో ఏకంగా గ్రావెల్ రోడ్డు నిర్మించి రాత్రిపూట హిటాచీ, జేసీబీలతో ఇసుకను తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు ఇసుక దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించగా గూడలికి చెందిన అధికార పార్టీ నాయకుడు వారిని బెదిరించినట్లు సమాచారం. «ఇది మా అడ్డా.. మాకు ఎవరూ అడ్డు రాకూడదు» అని హుకుం జారీ చేసినట్లు యువకులు తెలిపారు. ఈ క్రమంలో గూడలిలో పెట్రేగిపోతున్న ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడ నిఘా పెట్టి ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

18, 19 తేదీల్లో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

దక్కిలి : ఈ నెల 18, 19 తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్) క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈవోలు కె.వెంకటేశ్వర్లు, పి.జగదీష్, దక్కిలి హైస్కూల్ పీడీ వెంకటయ్య తెలిపారు. ఇందులో భాగంగా దక్కిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అండర్–14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్ పుట్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అండర్ 14 విభాగంలో పాల్గొనే వారు 2011 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని, అండర్ 17 విభాగంలో పాల్గొనే వారు 2008 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. వివరాలకు ఎస్‌జీఎఫ్ సమన్వయకర్త వెంకటయ్యను 705318073లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా వినాయకుడి ఊరేగింపు



వినాయకుడి విగ్రహాల ఊరేగింపు

గూడూరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. యువకులు రంగుల చల్లుకుని ఆనందంగా గడిపారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా వాకాడులోని తూపిలిపాళెం సముద్రం వద్దకు నిమజ్జనానికి తరలించారు.

ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు

నాయుడుపేట టౌన్ : వినాయక చవితిని పురస్కరించుకుని బ్రాహ్మణవీధిలో ఉన్న షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వినాయకుడి విగ్రహాన్ని వాహనంలో ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లి తూపిలిపాళెం లైట్ హౌస్ వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చడలవాడ మోహన్‌కృష్ణ శర్మ తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు చేశారు.

కండలేరులో 13.683 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 13.683 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,000 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 170, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ బాబి, పోలీసులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ఈనెల 8 తేదీన ఒక ఇంటిలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బాబి సోమవారం నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో ఉంటున్న కన్నలి తిరుపాలయ్య ఈ నెల 8 తేదీ రాత్రి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐ బాబి దర్యాప్తు చేశారు. బాధితుడి సమీపం బంధువైన పెళ్లకూరు మండలం దిగువ చావాలికి చెందిన కన్నలి కృష్ణ చైతన్య చోరీ చేసినట్టు గుర్తించారు. సోమవారం నాయుడుపేటలోని గోమతి సెంటర్ వద్ద అతన్ని అరెస్టు చేశారు. అతని నుంచి 8 సవర్ల బంగారు నగలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, పలు సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి

వెంకటగిరి రూరల్ : భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని స్ఫూర్తి సేవా సంస్థ అనుబంధ సంస్థ భూ సంరక్షణ సేవా సమితి సెక్రటరీ డక్కిలి సుబ్బరామయ్య కోరారు. వెంకటగిరిలో సోమవారం స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమిలేని పేదలకు భూములు ఇప్పించడం, సమస్యల పరిష్కారానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సభ్యులు సుధాకర్, నారి సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినపట్నంలో జాయింట్ కలెక్టర్ పర్యటన

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయతీలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ భన్సల్ సోమవారం పర్యటించారు. గ్రామ సమీపంలో క్రిస్ సిటీ ఏర్పాట్లకు సంబంధించిన భూసేకరణను ఇటీవల పూర్తి చేశారు. క్రిస్ సిటీ భూమి పూజకు ప్రధాని నరేంద్రమోదీ రానున్నారు. ఈ క్రమంలో గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీలు ఈ ప్రాంతంలో పర్యటించి సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అప్పట్లో ప్రధాని పర్యటన వాయిదా పడింది. తాజాగా ప్రధాని వస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే జాయింట్ కలెక్టర్ ఈ ప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. హెలిప్యాడ్, సభా వేదిక, శంకుస్థాపన శిలాఫలకం, భద్రతకు సంబంధించిన పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని పరిపాలన

వెంకటగిరి(సైదాపురం) : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరిపాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప తెలిపారు. వెంకటగిరిలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన వ్యక్తి నరేంద్రమోదీ అన్నారు. దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వరప్రసాద్, బాలాజీ, యోగేశ్వరరావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

19న తడ ఐటీఐలో జాబ్ మేళా

తడ: ఈ నెల 19వ తేదీన తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. శ్రీసిటీలోని బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ప్రతినిధులు ఇంటర్వ్యూ చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన యువతీ, యువకులు హాజరుకావచ్చని తెలిపారు. ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, బయోడేటా, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్(httpr:rkiuniverre.aprrdc.in)లో నమోదు చేసుకున్న అడ్మిట్ కార్డుతో జాబ్‌మేళాకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9154449677లో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ముస్లింలు సోమవారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జామియా, పెద్ద దర్గాలోని అమీర్‌షావలి, పాత బస్టాండు వద్ద ఉన్న నూర్, అమరాగార్డెన్‌లోని మక్కా, ఎల్‌ఏ సాగరం కొత్త, పాత బీడీకాలనీలోని మసీదు, మునిరత్నం నగర్, పాగొట్టం కాలనీలో ఉన్న మసీదుల వద్ద రాత్రి జాగారం చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు, కౌన్సిలర్ షేక్ షబ్బీర్ పేదలకు అన్నదానం చేశారు. రైల్వే స్టేషన్, పాత బస్టాండు ప్రాంతాల్లో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



నాయుడుపేట టౌన్ : బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న షబ్బీర్

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలో సోమవారం ముస్లింలు మిలాద్ ఇన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో మసీదుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆటోను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొంది. బాధితుల కథనం మేరకు.. వాకాడు మండలం గొల్లపాళెంకు చెందిన కొంత మంది రైతులు ఆటోలో నాయుడుపేటకు వచ్చి వరి ధాన్యం కొనుగోలు చేశారు. బస్తాలను ఆటోలో వేసుకుని గొల్లపాళెం బయలుదేరారు. నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఆటో డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి ఆటోను పక్కకు తిప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికి ఆటో ముందు భాగం దెబ్బతిని రైతులు కృష్ణయ్య, మనెయ్య, కస్తూరయ్య, హరి, ఆటో డ్రైవర్ గురువయ్య స్వల్పంగా గాయపడ్డారు. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మినీ లారీ బోల్తా

చిల్లకూరు : మండలంలోని రైటార్ సత్రం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం మినీ లారీ బోల్తాపడి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. లారీ అద్దాలు తీసుకుని నెల్లూరు నుంచి నాయుడుపేటకు వెళుతోంది. రైటార్ సత్రం సమీపంలో ముందు టైర్ పంక్చర్ అయి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ సుజిత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. స్వర్ణా టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గ్రావెల్, ఇసుక రవాణాపై పోలీసుల దాడులు



పోలీసులకు పట్టుబడిన గ్రావెల్ లారీలు



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు, పుల్లూరు గ్రామాల నుంచి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాపై ఆదివారం రాత్రి పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు చేపట్టారు. మూడు గ్రావెల్ లారీలు, ఒక ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రోసనూరు ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీలతో నాయుడుపేట పరిసర ప్రాంతాల్లోని లేఅవుట్లకు తరలిస్తుండగా స్థానిక సీఐ సంగమేశ్వరరావు దాడులు చేశారు. మూడు లారీలను దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే సోమవారం పుల్లూరు గ్రామం వద్ద స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని పెళ్లకూరు పోలీసులకు అప్పగించారు. రోసనూరు, కానూరు, శిరసనంబేడు అటవీ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాదని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. వాటిని అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా యంత్రాలతో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.